క్లుప్తంగా

డ్రైనేజీ పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబు

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డు మంగమారిపేటలో డ్రైనేజీ నిర్మాణానికి కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబు బుధవారం శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. 15 ఏళ్లుగా ఈ ప్రాంతంలో డ్రైనేజీలు లేక ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాస్ దృష్టికి సమస్య తీసుకెళ్లడంతో డ్రైనేజీల నిర్మాణానికి అధికారులను ఆదేశించారు. ఈ నేపథ్యంలో పనులు ప్రారంభించామని కొండబాబు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు దూడ అచ్చారావు, మేరుగు చిన్నారావు, మేరుగు అప్పన్న, శివ తదితరులు పాల్గొన్నారు.

మరిడిమాంబ ఆలయానికి రూ.50 వేల విరాళం



ఆలయ నిర్మాణానికి నగదు అందిస్తున్న వెంకట సురేష్

తగరపువలస: జీవీఎంసీ రెండో వార్డు నమ్మివానిపేటలో నిర్మించనున్న మరిడిమాంబ ఆలయానికి నమ్మి వెంకట సురేష్ రూ.50,116 విరాళం బుధవారం అందించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు నమ్మి మాధవ, బొట్ట పరదేశి, నమ్మి శ్రీరామ్, నమ్మి అప్పలనాయుడు, నమ్మి సింహాచలం, రాజు, పెద్ద శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో దీపోత్సవం విజయవంతం

పద్మనాభం: అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి దీపోత్సవాన్ని విజయవంతం చేయాలని ఎంపీపీ కంబోతు రాంబాబు అన్నారు. పద్మనాభంలో అనంత పద్మనాభస్వామి గిరిపై డిసెంబర్ 12న జరగనున్న దీపోత్సవంపై బుధవారం అనంతుని కల్యాణ మండపంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు దీపోత్సవం విజయవంతానికి సహకారం అందిస్తారన్నారు. సమావేశంలో ఈవో నానాజీబాబు, తాలాడ పద్మనాభం, కాళ్ల నగేష్ కుమార్, కంటుబోతు ఎర్నాయుడు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పిచ్చికుక్క స్వైరవిహారం

తగరపువలస: భీమిలి పెద్దబజారులో మూడు రోజులుగా పిచ్చికుక్క స్వైరవిహారం చేస్తూ పలువురిని గాయపరుస్తుండడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు క్యాంపు కార్యాలయానికి సమీపంలో టీ దుకాణం వద్ద నిలబడిన భీమిలి జోన్ శానిటరీ ఇన్‌స్పెక్టర్‌పై కూడా దాడి చేసినట్టు తెలిసింది. ఇటీవల తగరపువలస, చిట్టివలస, సంగివలస డివిజన్లలో నడిచి వెళ్లేవారు, వాహనాలపై రాకపోకలు సాగించేవారిని సైతం కుక్కలు విడిచిపెట్టడం లేదు. కుక్కల నియంత్రణకు జీవీఎంసీ చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

యువకుడి ఆత్మహత్య

తగరపువలస: భీమిలి మండలం దాకమర్రి పంచాయతీ అల్లుపేట గ్రామానికి చెందిన అల్లు సూరి (25) మంగళవారం రాత్రి ఇంట్లో ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు మృతుని తండ్రి అప్పలనర్సి భీమిలి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మంగళవారం రాత్రి మేడపై నిద్రపోయిన సూరిని బుధవారం ఉదయం నిద్ర లేపడానికి వెళ్లి చూడగా పిల్లర్ హుక్‌కు ఉరి వేసుకుని కనిపించాడు. పదో తరగతి వరకు చదువుకున్న సూరి ఇంటి వద్దే ఉంటూ పశువులను మేపుతుండేవాడు. ఎస్ఐ గంటా హరీష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజల ఇంటికే సుపరిపాలన



తాళ్లవలస గ్రామ సచివాలయంలో ప్రతిజ్ఞ చేస్తున్న డ్వాక్రా మహిళలు



గంభీరం గ్రామ సచివాలయ భవనం



రేషన్ కార్డు నుంచి పట్టాదార్ పాస్ పుస్తకం వరకూ... బర్త్, క్యాస్ట్, ఇన్‌కమ్ సర్టిఫికెట్... ఇలా ఏ ధ్రువీకరణపత్రం కావాలన్నా, ఏ అవసరమున్నా... వలంటీర్లే ఇంటికి వచ్చి దరఖాస్తు చేసి, రోజుల వ్యవధిలోనే మంజూరు చేసేలా సచివాలయ వ్యవస్థను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అద్భుతంగా సృష్టించారు. మహాత్ముడు కలలు కన్న గ్రామ స్వరాజ్య సాధన దిశగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన సంస్కరణలలో సచివాలయ వ్యవస్థ ప్రధానమైంది. ప్రతి పంచాయతీ, గ్రామంలో అక్కడి ప్రజల సమస్యలు స్థానికంగానే సులువుగా పరిష్కరించేందుకు ఉద్దేశించిన ఈ వ్యవస్థ దేశంలోని చాలా రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తోంది. గతంలో ఏ సర్టిఫికెట్ కావాలన్నా.. ఏ పని జరగాలన్నా మండల, జిల్లా కేంద్రాలకు రోజుల తరబడి తిరగాల్సి వచ్చేది. సమయం, డబ్బు వృథాతోపాటు ప్రయాసపడేవారు. ప్రస్తుతం గ్రామంలోనే పనులు పూర్తవుతుండడంతో ప్రజలంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు. ధ్రువీకరణ పత్రాల జారీతోపాటు 33 రకాల సేవలు స్థానికంగానే అందుతున్నాయి. ముఖ్యంగా నాయకుల ప్రమేయం, సిఫారసుల పని లేకుండా అర్హతే ప్రామాణికంగా, వివక్షకు తావులేకుండా అందరికీ సేవలందుతున్నాయి.

– తగరపువలస

నియోజకవర్గంలో పరిస్థితి ఇదీ...

46 గ్రామ సచివాలయాలు

రూ.3.90 కోట్లు ఈ నిధులతో భీమిలి మండలంలో 12 గ్రామ సచివాలయాలు నిర్మించారు.

రూ.5.45 కోట్లు ఈ నిధులతో పద్మనాభం మండలంలో 16 గ్రామ సచివాలయాలు నిర్మించారు.

రూ.5.60 కోట్లు ఈ నిధులతో ఆనందపురం మండలంలో 18 గ్రామ సచివాలయాలు నిర్మించారు.

112 వార్డు సచివాలయాలు (జీవీఎంసీ భీమిలి, మధురవాడ జోన్ల పరిధిలో..)

611 గ్రామ సచివాలయాల ఉద్యోగుల సంఖ్య

1008 వార్డు సచివాలయాల ఉద్యోగుల సంఖ్య

2661 మొత్తం సచివాలయాల పరిధిలో పనిచేస్తున్న వలంటీర్లు



దాకమర్రి సచివాలయంలో జగనన్న సురక్ష వైద్య సేవలు అందిస్తున్న వైద్యులు



తాటితూరు గ్రామ సచివాలయ భవనం

పాలన, సేవలు చేరువయ్యాయి



వలంటీర్, సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రభుత్వం నుంచి పాలన, సేవలు ప్రజలకు అతి చేరువలోకి వచ్చాయి. ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగకుండానే సంక్షేమం, సర్టిఫికెట్లు ఇంటి గుమ్మం ముందు అందుతున్నాయి. ఈ విషయంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి హేట్సాఫ్ చెబుతున్నాం.

– షేక్ అబ్దుల్ గఫూర్, తగరపువలస

తిరిగే పని తప్పింది



గతంలో చిన్న సర్టిఫికెట్ కావాలన్నా రోజుల తరబడి ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేది. ఇప్పుడు సచివాలయాల సిబ్బందే ఇంటింటికీ వచ్చి ఏ పథకానికి ఎవరు అర్హులు అని ఆరా తీసి మంజూరు చేస్తున్నారు. ఈ వ్యవస్థతో ప్రజలందరికీ మేలు జరుగుతోంది.

– నీలాపు గౌరీ మనోహర్‌రెడ్డి, చిట్టివలస

ఓటరు జాబితాలో తప్పులు దొర్లితే చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో భాస్కరరెడ్డి

భీమునిపట్నం: భీమిలి పరిధిలో ఓటర్ల జాబితాలో పొరపాట్లు, తప్పులు దొర్లితే సంబంధిత సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని ఆర్డీవో, నియోజకవర్గ ఓటర్ల నమోదు అధికారి ఎస్.భాస్కరరెడ్డి హెచ్చరించారు. బుధవారం సాయంత్రం రాజకీయ పార్టీల నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా జాబితా పరిశీలన ప్రక్రియ సరిగ్గా జరగలేదని వచ్చిన ఆరోపణలపై స్పందించారు. అన్ని ప్రాంతాల్లోనూ బూత్‌లెవల్ అధికారులు జాగ్రత్తగా జాబితాలు పరిశీలించి అవసరమైన తొలగింపులు, కొత్త వారి ఓట్లు చేర్చాలన్నారు. తప్పులు జరిగాయన్నది అపోహేనని, ఏవైనా ఆధారాలు వుంటే తన దృష్టికి తీసుకొస్తే తక్షణమే చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు.

చిత్తశుద్ధితో లక్ష్య సాధన



మాట్లాడుతున్న జెడ్పీ సీఈవో పోలినాయుడు

పద్మనాభం: విద్యార్థినులు ఓ లక్ష్యం నిర్దేశించుకుని చిత్తశుద్ధితో చదివినప్పుడు సాధించగలరని విశాఖపట్నం జిల్లా పరిషత్ సీఈవో పోలినాయుడు అన్నారు. మండలంలోని కస్తూర్బా విద్యాలయాన్ని బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్ని ఒడుదుడుకులెదురైనా శ్రమించి విజయం సాధించాలని సూచించారు. క్రమశిక్షణ, విలువల కలిగిన వ్యక్తులతో స్నేహం చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ కె.శ్రీదేవి, ఐసీడీఎస్ పీవో శ్రీదేవి, డీపీఆర్వో మణిరాం, సమగ్ర శిక్షా ఏపీసీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సకాలంలో వినతులు పరిష్కరించాలి

'జగనన్నకు చెబుదాం'లో కలెక్టర్ మల్లికార్జున



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ మల్లికార్జున

పద్మనాభం: 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమంలో ప్రజల నుంచి స్వీకరించిన వినతులు సకాలంలో పరిష్కరించాలని కలెక్టర్ ఎ.మల్లికార్జున అన్నారు. పద్మనాభంలోని వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో బుధవారం నిర్వహించిన 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమంలో కలెక్టర్‌తోపాటు జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్ వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా మల్లికార్జున మాట్లాడుతూ అర్జీదారులు సంతృప్తి చెందేలా పరిష్కారం చూపాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నందున అధికారులు చిత్తశుద్ధితో క్షేత్రస్థాయిలో పరిశీలించి, సకాలంలో సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. అధికారుల తీరుతో అర్జీదారులు సంతృప్తి చెందాలని హితవు పలికారు. దూర ప్రాంతాల నుంచి రాలేని అర్జీదారులు మండల స్థాయిలోనే తమ సమస్యలు పరిష్కరించుకునేందుకు ఇదో చక్కని వేదికన్నారు. అనంతరం అర్జీదారుల సమస్యలు విని 74 మంది నుంచి వినతులు స్వీకరించారు. కాలనీల్లో అపరిష్కృతంగా ఉన్న దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని, ఇళ్ల స్థలాలు కేటాయించాలని, కాలనీ ఇళ్లు, పింఛన్లు మంజూరు చేయాలని, భూ వివాదాలు తదితర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అర్జీలు ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్డీవో భాస్కరరెడ్డి, జిల్లా పరిషత్ సీఈవో ఎం.పోలినాయుడు, పద్మనాభం తహసీల్దార్ కె.వేణుగోపాలరావు, ఎంపీడీవో ఎం.విజయ్ కుమార్ పాల్గొన్నారు.

త్వరలో ఇంటింటికీ కుళాయిలు



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న నాయకులు

పద్మనాభం: నెల రోజుల్లోగా ఇంటింటికీ కుళాయిల ద్వారా నీరు సరఫరా చేస్తామని ఎంపీపీ కంటుబోతు రాంబాబు అన్నారు. మండలంలోని మద్ది గ్రామంలో రూ.19 లక్షల జల జీవన్ మిషన్ నిధులతో కుళాయిల నిర్మాణానికి వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావుతో కలిసి బుధవారం శిలాఫలకం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ కుళాయిల నిర్మాణ పనులు యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. అనంతరం సచివాలయ ప్రాంగణంలో గ్రంథాలయాన్ని పునః ప్రారంభించారు. కార్యక్రమంలో బుగత సత్యనారాయణ, బాందేవపురం కో – ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు బుగత శ్రీనివాసరావు, నాయకులు బోని సన్యాసినాయుడు, బుగత ఎర్నాయుడు, ఈవోఆర్డీ కుమార్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల ఫ్లెక్సీ ఆవిష్కరణ

మండలంలోని మద్ది సచివాలయం వద్ద బుధవారం సంక్షేమ పథకాల ఫ్లెక్సీని ఎంపీపీ కంటుబోతు రాంబాబు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు ఆవిష్కరించారు. అనంతరం వైఎస్సార్ సీపీ జెండా ఎగుర వేశారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



హనుమంతుని విగ్రహానికి పూజలు చేస్తున్న భక్తులు

మధురవాడ: స్థానిక ఓజోన్ వ్యాలీ ప్రాంతంలో గల శ్రీ అభయాంజనేయ స్వామి దేవాలయం ద్వితీయ వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా స్వామికి విశేష అభిషేకాలతోపాటు పూజలు, హోమం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పబ్లిక్ డిమాండ్

పగటిపూట వెలుగులు



పీఎం పాలెం ఆర్‌హెచ్ కాలనీలో పగటిపూట వెలుగుతున్న విద్యుత్ దీపం

తగరపువలస: జీవీఎంసీ 6వ వార్డు పీఎం పాలెం, ఆర్‌హెచ్ కాలనీలోని నూకాలమ్మ గుడి వెనుక విద్యుత్ దీపాలు మూడు మాసాలుగా పగటిపూట కూడా వెలుగుతున్నాయి. దీంతో యూనిట్ల కొద్దీ విద్యుత్ వృథా అవుతోంది. అవసరమైన చోట రాత్రివేళ వెలగక స్థానిక నివాసులు ఇబ్బంది పడుతున్నారు. పగటివేళ విద్యుత్ వృథాను జీవీఎంసీ అధికారులు అరికట్టాలి.

– బాబూరావు, ఆర్‌హెచ్ కాలనీ

సీఎం జగన్‌తోనే అవినీతి రహిత పాలన



పాత మూలకుద్దులో ప్రచారంలో ఎంపీపీ వాసురాజు తదితరులు



గొట్టిపల్లిలో కరపత్రాలు ప్రదర్శిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు, అధికారులు

- మరలా ముఖ్యమంత్రిని చేసుకుంటే దళారీ వ్యవస్థ పూర్తిగా అంతం
- ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

ఆనందపురం : సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో రాష్ట్రంలో అవినీతి, లంచగొండితనం తగ్గిపోయాయని, పూర్తిగా ప్రక్షాళన జరిగి పేదలకు మేలు జరగాలంటే మరలా జగన్ మోహన్ రెడ్డినే సీఎంను చేసుకోవాలని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు కోరారు. మండలంలోని గొట్టిపల్లిలో బుధవారం 'గడప గడపకు మన ప్రభుత్వం, 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం హయాంలో జన్మభూమి కమిటీలు ఏర్పాటు చేసి అన్ని వనరులూ దోచుకుని సంక్షేమం, అభివృద్ధిని విస్మరించారని ఆరోపించారు. పేదలకు అందాల్సిన పథకాలు టీడీపీ సానుభూతిపరులకే దక్కాయన్నారు. ఈ నేపథ్యంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రాజకీయాలు, పార్టీలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడంతో అవినీతికి ఆస్కారం లేకుండా అందరికీ మేలు జరిగిందన్నారు. ముఖ్యంగా అధిక మొత్తంలో ఫీజులు చెల్లించుకోలేని విద్యార్థులకు పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ కల్పిస్తున్నారని కొనియాడారు. పొరపాటున టీడీపీ, జనసేనను బలపరిస్తే ఎప్పటిలాగే కష్టాలు మొదలవుతాయని, మరలా జగన్ మోహన్‌రెడ్డిని సీఎంను చేసుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం వైఎస్సార్ సీపీ జెండా ఆవిష్కరించి, సంక్షేమ పథకాల కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గంటా జగదీశ్వరరావు, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ బంటుబిల్లి మణిశంకర నాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు బంక సత్యం, వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు, వైస్ ఎంపీపీ పాండ్రింకి శ్రీను, ఇల్లపు వెంకటరావు, సర్పంచ్‌లు గండ్రెడ్డి శ్రీనివాస్, షిణగం అప్పలరాజు, బంక శ్రీను, నాయకులు బంటుబిల్లి సూరి అప్పలనాయుడు, బొట్టా రామకృష్ణ, గంటా అప్పలరాజు, కోరాడ అప్పలస్వామి నాయుడు, బుత్తల రమణ, రౌతు శ్రీను, కోరాడ వెంకట రమణారావు, బలిరెడ్డి మహేష్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల ఫ్లెక్సీ ఆవిష్కరణ

మండలంలోని లొడగలవానిపాలెంలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమంలో భాగంగా సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన సంక్షేమ, అభివృద్ధి పథకాల ఫ్లెక్సీని నాయకులు ఆవిష్కరించారు. అనంతరం పార్టీ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ లొడగల రాజేశ్వరి, ఎంపీటీసీ సభ్యురాలు రౌతు శ్యామల, పార్టీ మండల అధ్యక్షుడు బంక సత్యం, భీమిలి మార్కెట్ కమిటీ చైర్మన్ ఎలమంచిలి సూర్యనారాయణ, నాయకులు పాండ్రింకి అప్పారావు, రౌతు వెంకటరావు, బంక సూర్యనారాయణ, లొడగల వెంకటరమణ, గొలగాని వెంకట అప్పారావు, బంక కృష్ణం నాయుడు, రౌతు అప్పలరాజు పాల్గొన్నారు.

పథకాల కొనసాగింపు జగన్‌తోనే సాధ్యం

తగరపువలస: ప్రస్తుతం రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు కొనసాగాలంటే 2024లో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మరలా ముఖ్యమంత్రిగా చేసుకోవాలని ఎంపీపీ దంతులూరి వాసురాజు అన్నారు. 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమం బుధవారం మూలకుద్దు పంచాయతీలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బోని బంగారునాయుడు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గాడు శ్రీను, చిల్ల హరి, సర్పంచ్ సమ్మిడి శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యుడు చెల్లూరి నగేష్, పాట్నూరు చంద్రశేఖర్, మల్లేటి హరి, కొల్లి రామకృష్ణ, కొయ్య రామకృష్ణ, దేవి చిట్టి తదితరులు పాల్గొన్నారు.



చిట్టివలస కార్మికవాడలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేస్తున్న పీఏసీఎస్ అధ్యక్షుడు రామునాయుడు తదితరులు

- జీవీఎంసీ ఒకటో వార్డు చిట్టివలస కార్మికవాడలో పీఏసీఎస్ అధ్యక్షుడు అక్కరమాని రామునాయుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి జీరు వెంకటరెడ్డి, వార్డు ప్రతినిధులు చింతగుంట శివ, నీలాపు రామిరెడ్డి, పందిరి విజయ్, చార్లీ, ముని రమేష్, దుంప సాయిరెడ్డి, వెంపాడ రమణ, రంగూరి శివ, అడ్డగర్ల చిట్టిబాబు, జల్దు సంతోష్, చింతగుంట శ్రీరాములు తదితరులు వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేసి ఇంటింటా ప్రచారం నిర్వహించారు.

రోడ్ల పక్కనే భవన నిర్మాణ వ్యర్థాలు



ఆదర్శనగర్ రహదారిలో ఈఎస్ఐ ప్రహరీ వద్ద భవన నిర్మాణ వ్యర్థాలు

తగరపువలస: భీమిలి జోన్‌లో భవన నిర్మాణదారులు ఇష్టం వచ్చినట్టుగా నిర్మాణ మెటీరియల్‌ను రహదారుల పైన, డెబ్రిస్‌ను రహదారుల పక్కన పడేస్తున్నారు. ట్రాఫిక్ పోలీసులు, జీవీఎంసీ సిబ్బంది అనుమతి లేకుండా రోడ్లను ఒకవైపు మూసివేసి కాంక్రీట్ మిక్సర్‌లను రోడ్డుపై అడ్డంగా పెడుతున్నారు. ఈ కారణంగా చుట్టుపక్కల ఇళ్లన్నీ దూళిమయంగా మారుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోజుల తరబడి వీటిని తొలగించకపోవడంతో స్థానికులతోపాటు వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇకపై రోడ్ల పక్కన డెబ్రిస్, భవన నిర్మాణ మెటీరియల్ అనధికారికంగా రోజుల తరబడి ఉంచినవారిపై టౌన్ ప్లానింగ్ సిబ్బంది చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.